ఈనాడు
మహబూబ్‌నగర్
గురువారం అక్టోబరు 10, 2024

ఇల వైభోగం.. ఆది దంపతుల కల్యాణం


కల్యాణంలో భాగంగా తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

అలంపూర్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పల్లకి సేవలో జోగులాంబ ఆలయం వరకు ఎమ్మెల్యే విజయుడు, ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త సభ్యులు మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతి రెడ్డి దంపతులు మంగళ వ్యాయిదాలతో తీసుకొచ్చారు. ముస్తాబు చేసిన విగ్రహాలను ఆలయం చుట్టూ పల్లకిలో ఊరేగించి కల్యాణ మండపానికి చేర్చారు. వేదమంత్రాల నడుమ స్వామి, అమ్మ వార్ల కల్యాణం మూలా నక్షత్ర శుభ గడియలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవం తిలకించారు. అనంతరం అమ్మ వారిని సింహవాహన సేవలో భాగంగా పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించారు.

కాళరాత్రిగా జోగులాంబ: జోగులాంబ దేవి భక్తులకు కాళరాత్రి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సొంత రెవెన్యూనే లక్ష్యం!

- రైతులను పట్టిపీడిస్తున్న అధికారులు
- స్థిరాస్తి వ్యాపారుల కబ్జాలు, అక్రమాలకు అండ

జడ్చర్లలో భూ వ్యవహారం సీసీఎల్‌ఏకు వెళ్లింది. ఓ సర్వే నంబరులోని 16 ఎకరాల 32 గుంటల స్థలంలో 2 ఎకరాల 10 గుంటల భూదాన్ భూమి ఉంది. దీనికి ఓఆర్‌సీ ఇచ్చారని, ఇందులో జిల్లాకు చెందిన రెవెన్యూ అధికారుల పాత్ర ఉందని ఆరోపణలు వచ్చాయి. దీనిపై వివరణ కోరినా సరిగ్గా స్పందించకపోవటంతో సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిత్తల్ గత నెలలో జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డిని సస్పెండ్ చేశారు.

తాజాగా కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజుపైనా వేటు పడింది. ధరణిలో పాసు పుస్తకాలకు సంబంధించిన కోర్టు కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించినందుకు విధుల నుంచి తొలగించారు. ఈ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇనామ్, ప్రభుత్వ భూములకు ఎన్‌వోసీ, ఓఆర్‌సీలు ఇచ్చారని, డబ్బులు ఇవ్వకపోతే ఏ పనీ చేయరని ఆరోపణలు ఉన్నాయి. మొత్తానికి ఆర్డీవోను భూసంబంధ వ్యవహారంలోనే సస్పెండ్ చేశారు.

ఈనాడు, మహబూబ్‌నగర్

కొల్లాపూర్ ఆర్డీవో, జడ్చర్ల తహసీలార్ కొద్ది రోజుల వ్యవధిలోనే సస్పెండ్ కావటం ఉమ్మడి జిల్లాలో పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ ఏడాది గోపాల్‌పేట, గుండుమల్ తహసీల్దార్లు, కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్ ఏసీబీకి పట్టుబడ్డారు. ఇలాంటి వాళ్లు ఉమ్మడి జిల్లాలో ఇంకా చాలా మంది ఉన్నారు. పాలమూరు వ్యాప్తంగా అసైన్డు, సీలింగ్, భూదాన్ భూములు ఉన్నాయి. స్థిరాస్తి వ్యాపారులు, కొందరు నేతలు కలిసి రెవెన్యూ చట్టాల్లో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని ఎన్‌వోసీలు తీసుకుంటున్నారు. వీరికి సాంకేతికంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొందరు రెవెన్యూ అధికారులు అన్నీ తామై వ్యవహరిస్తూ సహకరిస్తున్నారు. ఈ వ్యవహారాల్లో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారుతున్నాయి. ఇద్దరు అధికారుల సస్పెన్షన్ నేపథ్యంలో జిల్లాల ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరముంది.


మహబూబ్‌నగర్ : ప్రజావాణిలో కలెక్టర్‌కు భూ సమస్య వివరిస్తున్న బాధిత రైతులు

జిల్లాల్లో మచ్చుకు కొన్ని..

- మహబూబ్‌నగర్ జిల్లా గతంలో పనిచేసిన ఓ ఆర్డీవో ఏకంగా 50కి పైగా ఓఆర్‌సీలు ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ భూమికి నిబంధనలకు విరుద్ధంగా ఓఆర్‌సీని ఇచ్చారు. ప్రభుత్వం మారిన తర్వాత జిల్లాకు చెందిన ఇద్దరు ముఖ్య ప్రజాప్రతినిధులు ఆ ఓఆర్‌సీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ ఆర్డీవో ఓఆర్‌సీ ఇచ్చిన 50కి పైగా భూముల రిజిస్ట్రేషన్లను ఆపివేశారు. అంతర్గత విచారణ సాగుతోంది.
- వనపర్తి జిల్లాలోని ఓ పురపాలికలో దేవాలయానికి చెందిన సుమారు 30 ఎకరాల భూమికి గతంలో ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు అక్రమంగా ఓఆర్‌సీ ఇచ్చారు. హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఆ భూముల విలువ రూ.కోట్లల్లో ఉంది. ఈ వ్యవహారంలో కొందరు రెవెన్యూ అధికారులకు పెద్దఎత్తున మామూళ్లు అందించినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.
- హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారికి అనుకుని ఉన్న బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, భూత్పూరులోని పలు ప్రభుత్వ భూములకు నిబంధనలకు విరుద్ధంగా ఓఆర్‌సీలు ఇచ్చినట్లు విమర్శలు ఉన్నాయి. జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో కొన్ని చోట్ల ప్రభుత్వ భూములకు ఇష్టారాజ్యంగా ఓఆర్‌సీ, ఎన్‌వోసీలు ఇచ్చారని ఆరోపణలు వచ్చాయి.

ప్రజావాణిలో అన్నీ భూసమస్యలే : తమ భూ సమస్యలపై స్పందించటం లేదని, డబ్బులు ఇవ్వకపోతే పనులు చేయటం లేదని, నెలలు, ఏళ్ల తరబడిగా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చేవాళ్లల్లో 70 శాతం మంది భూ సమస్యల వాళ్లే. మండల, డివిజన్ స్థాయి అధికారులు పట్టించుకోకపోవటం వల్లనే ఇక్కడిదాకా వస్తున్నారని కలెక్టర్లు కూడా అంగీకరిస్తున్నారు. అయినా పరిస్థితిని చక్కదిద్దటంలో విఫలమవుతున్నారు. ధరణిలో మొత్తం 33 మాడ్యుల్స్ ఉన్నాయి. ఎక్కువగా పాసుపుస్తకాల్లో పేర్లలో తప్పులు, సర్వే నంబర్ల గల్లంతు, డిజిటల్ సంతకాలు పెండింగ్, భూ విస్తీర్ణం తక్కువగా నమోదు తదితరాలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. స్థానిక అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి ఉన్నతాధికారులకు నివేదికను ఇవ్వాలి. ఇందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.



కొలువుల పండగ.. ఆనందం నిండగా!

హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కొత్త ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు నియామకపత్రాలను అందజేశారు. దామరగిద్ద మండలం సజనాపూర్ గ్రామానికి చెందిన చెన్నప్ప నియామక పత్రం అందుకుంటున్న దృశ్యమిది.

- ఈనాడు, హైదరాబాద్

రైతుల ప్రయోజనాలే ముఖ్యం


మార్కెట్ ఛైర్‌పర్సన్, డైరెక్టర్లతో ట్రాక్టర్‌లో వెళ్తున్న మ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, న్యూస్‌టుడే : మార్కెట్ కార్యవర్గానికి రైతుల ప్రయోజనాలే లక్ష్యం కావాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్లలో బుధవారం బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ తంగెళ్ల జ్యోతి, పాలకవర్గం పదవీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయం నుంచి మార్కెట్ వరకు ఎమ్మెల్యే పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ట్రాక్టర్‌లో వెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్‌లో రైతుల ధాన్యం వర్షపునీటిలో కొట్టుకుపోయినట్లు వార్తలు వచ్చాయని, ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ ఛైర్మన్ రాజేందర్‌గౌడ్, డైరెక్టర్లు, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, నేతలు బాద్మి శివకుమార్, నిత్యానందం, గౌస్ రబ్బానీ, తంగెళ్ల అల్వాల్‌రెడ్డి, అశోక్ యాదవ్, మహబూబ్‌నగర్ మార్కెట్ ఛైర్‌పర్సన్ అనిత, మార్కెట్ కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వాగును పూడ్చేస్తే వరదెలా పారేది?

కలెక్టరేట్‌కు సమీపంలోని పాలకొండ రోడ్డులో అక్రమాలు

నిఘా


కలెక్టరేట్ సమీపంలోనే ఊరచెరువు వాగును పూర్తిగా ఆక్రమించి పాతిన ప్లాట్ల రాళ్లు వర్షాలకు కొట్టుకుపోయిన ప్రాంతం


వెంచర్ ముందు భాగంలో వాగులోనే పాతిన హద్దురాళ్లు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రజాప్రతినిధి ముసుగులో ఓ స్థిరాస్తి వ్యాపారి వాగునే పూడ్చేసి డీటీసీపీ, రెరా అనుమతులు లేకుండా అక్రమ వెంచర్ ఏర్పాటు చేశాడు. డీటీసీపీ రెరా నిబంధనలకు భిన్నంగా కేవలం 20 అడుగుల విస్తీర్ణంతో రెండు వైపులా రెండు రోడ్లు నిర్మించాడు. అర ఎకరం పొలంలో 10 ప్లాట్లు చేసి ఒక్కోదాన్ని రూ.13వేలకు గజం చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. వాగును కనుమరుగు చేస్తున్న ఈ అక్రమ వెంచర్ భూత్పూర్ రోడ్డులో జిల్లా యంత్రాంగమంతా కొలువుదీరిన కలెక్టరేట్‌కు సమీపంలోనే ఉన్నా నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులకు కానరావటం లేదు. 'వాగునూ వదలట్లేదు' శీర్షికతో ఆగస్టు 7న స్థిరాస్తి వ్యాపారి అక్రమ వెంచర్ ఏర్పాటు వ్యవహారాన్ని ప్రాథమిక దశలోనే 'ఈనాడు'లో బహిర్గతం చేసినా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకున్న పాపానపోలేదు. అప్పట్లోనే చర్యలు తీసుకుని ఉంటే వాగు ఆక్రమణకు గురయ్యేదే కాదు. నీటి పారుదల, రెవెన్యూ శాఖల అలసత్వం వల్ల వెంచర్ ఏర్పాటుకు కొనుగోలు చేసిన అర ఎకరం భూమి పొడవునా పాలకొండ మీదుగా ప్రవహించే 10 మీటర్ల విస్తీర్ణంలోని ఊరకుంట వాగును మూడు మీటర్లకు కుదించి మొరంతో పూడ్చేశాడు. ఆక్రమించిన వాగు పొడవునా ప్లాట్లు ఏర్పాటు చేశాడు. నీరు పల్లమెరుగు.. నిజం దేవుడెరుగంటారు. వాగును పూడ్చేస్తే వరద నీరు ముందుకెలా పారేది? స్థిరాస్తి వ్యాపారి చేసిన అక్రమాన్ని వరద నీరు గుర్తించి పట్టించినట్లు అక్కడి ఆనవాళ్లు చెబుతున్నాయి. ఇటీవలి వర్షాలకు వాగు పూడ్చిన పలుచోట్ల కోతకు గురికావడంతో కొట్టుకుపోయిన ప్లాట్ల రాళ్లు కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల ఒరిగిపోయి ఉన్నాయి. అధికారులు ఇకనైనా కళ్లు తెరచి క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఊరకుంట వాగును పొడవునా బఫర్ జోన్ గుర్తించి హద్దురాళ్లను ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. లేదంటే ఊరకుంట వాగు నీరు సమీప పొలాలను, అక్కడే ఉన్న రెండు పరిశ్రమలనూ ముంచెత్తే అవకాశముంది.


కలెక్టరేట్ ఆవరణలో మహిళా ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులతో కలిసి బతుకమ్మ ఎత్తుకున్న కలెక్టర్ విజయేందిర బోయి


కోలాటమాడుతున్న యువతులు


వెన్నెల్లో పూల సంబరం


మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం

స్థైర్యం వీడొద్దు..

ప్రశాంతత చెదరొద్దు!

- మానసిక ఆరోగ్యానికి ఇవే కీలకం
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న బాధితులు



మానసిక సమస్యలతో బాధపడే వారు రోజు రోజుకు పెరిగిపోతున్నారు. ఎప్పుడూ చిన్నబోయి కనిపించటం, తనలో తానే మాట్లాడుకోవటం, పరధ్యానంలో ఉండటం, కుంగిపోవటం, చిన్నదానికి ఏడవటం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇవ్వన్నీ మానసిక సమస్యలే అయినా అవగాహన లేక అలా భావించటం లేదు. వైద్యం చేయించుకోవటం లేదు. 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

- న్యూస్‌టుడే, పాలమూరు

ఉదయం నుంచి రాత్రి వరకు తమ పనులను ప్రశాంత వాతావరణంలో చేసుకుపోయే వ్యక్తులు మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. ఆలోచనలు, ఆకాంక్షలు, జీవితంపై అంచనాలు ఒకరకంగా, చేసే పనులు, వారి పరిస్థితులు మరో రకంగా ఉంటే మానసిక సంఘర్షణకు, ఒత్తిడికి గురవుతారు. తద్వారా వ్యాకులత చెంది వింతగా ప్రవర్తిస్తారు. ధూమపానం, మద్యపానం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు కూడా ఒత్తిడికి గురవుతుంటారు. ఫలితంగా వారు ఏం చేస్తున్నారో, ఎవరితో ఏం మాట్లాడుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంటుంది. ఇంట్లో కుటుంబ సభ్యుల ప్రేమ పొందలేనివారు, చదువులో వెనకబడినవారు, ఉద్యోగం రావటం లేదని బాధపడేవారు, అనారోగ్య, ఆర్థిక సమస్యలతో ఉన్నవారు మానసిక రుగ్మతలతో సతమతమవుతుంటారు. వీరంతా మానసిక వైద్య నిపుణులను సంప్రదిస్తే నయం చేస్తారు. అవగాహన లేక ఉమ్మడి జిల్లాలో చాలా మంది భూతవైద్యులను ఆశ్రయించి జీవితాలు పాడు చేసుకుంటున్నారు.

రోజూ 150కి పైగా కేసుల రాక : మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు ఉండటంతో మానసిక వైద్యసేవల విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. వివిధ రకాల మానసిక రుగ్మతలతో బాధపడుతున్నవారు ఉమ్మడి జిల్లాలోని ఆసుపత్రులకు కనీసం రోజుకు 150, నెలకు 4,500 మంది వస్తున్నారు. రుగ్మత తీవ్రంగా ఉంటే వైద్యులు ఔషధాలు ఇస్తున్నారు. తీవ్రత తక్కువగా ఉండి, కుటుంబ సభ్యుల సహకారం ఉంటే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

మానసిక రుగ్మతలు చాలా రకాలు.. : ఒకే విషయాన్ని పదే పదేగా ఆలోచించడం, దానిపైనే ధ్యాస కలిగి ఉండటం వల్ల మానసిక రుగ్మతలు వస్తుంటాయి. మానసిక రుగ్మతలు చాలా రకాలుగా ఉన్నాయి. ఒత్తిడి, ఆందోళన, వ్యాకులత, ఆత్మన్యూనత, విచిత్రంగా ప్రవర్తించడం, చేసిన పనిని పదే పదే చేస్తుండటం, అతిగా జాగ్రత్తలు తీసుకోవటం, గతంలో జరిగిన చెడు ఘటనలు తరచూ తలచుకుని బాధపడటం, మద్యపానం, ధూమపానం, మాదక ద్రవ్యాలు, గంజాయికి బానిస కావటం, తనలో తానే మాట్లాడుకోవటం, ఎవరు పిలిచినా స్పందించకుండా పిచ్చివారిలా ప్రవర్తించడం చేస్తుంటారు. ఆత్మహత్య ప్రయత్నం అనేది కూడా మానసిక రుగ్మతనే.


మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న మానసిక వైద్య నిపుణులు డా.రమాకాంత్


కుటుంబ సభ్యుల సహకారం అవసరం.. : ఉద్యోగ సాధన, ప్రేమ, వ్యాపారం ఇలా ఏదైనా విషయంలో విఫలమైనా, తీవ్ర ఒత్తిడికి లోనయినా, లైంగిక వేధింపులకు గురైనా, ఆర్థిక, అనారోగ్య సమస్యలు వెంటాడినా బాధితులకు కుటుంబ సభ్యులు అండగా నిలిచి భరోసా ఇస్తే మందులు అవసరం ఉండదు. కుటుంబ సభ్యుల నుంచే ప్రేమ, ఆదరణ కరవైతే వారు ఏకాకిగా మారుతారు. తీవ్ర ఒత్తిడికి గురవుతారు. అందుకే ఏ సమస్య వచ్చినా చెప్పుకొనేలా, చర్చించేలా ప్రోత్సహించాలి.

ఆల్కహాల్ బానిసలే ఎక్కువ.. : ఉమ్మడి జిల్లాలోని మానసిక రుగ్మతల బాధితుల్లో ఎక్కువ మంది ఆల్కహాల్ బానిసలే. ఆ తర్వాత స్థానంలో ధూమపానం, మాదక ద్రవ్యాలకు బానిసైన వాళ్లు ఉన్నారు. బాధితుల్లో 30 నుంచి 50 ఏళ్ల వారే ఎక్కువగా ఉంటున్నారు. చిన్న చిన్న వాటికి తల్లిదండ్రులు తిడుతున్నారని, కొడుతున్నారని, చదువులో రాణించలేకపోతున్నానని మానసిక ఒత్తిడికి గురవుతున్న టీనేజ్ విద్యార్థులు కూడా ఉంటున్నారు. అన్ని మానసిక సమస్యలకు పరిష్కార మార్గం ఉంది. మానసిక వైద్య నిపుణులను సంప్రదించాలి.

- డా.రమాకాంత్, మానసిక వైద్య నిపుణులు, మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

సరిహద్దులు దాటిన దందా

గుట్కా, మట్కా, జూదంతో చిత్తవుతున్న జీవితాలు


సరిహద్దులో కర్ణాటక చెక్‌పోస్ట్ ఇలా..

న్యూస్‌టుడే- మక్తల్ పట్టణం

అలవాటు వ్యసనంగా మారితే ఇక అంతే సంగతులు. ఫలితంగా అప్పులు.. అనారోగ్యాలు.. ఆత్మహత్యలు.. హత్యలకు దారితీస్తున్న ఉదాహరణలు ఎన్నో. కుతూహలంతో మొదలెట్టి చెడు అలవాట్లుగా మారి చివరికి వాటికి బానిసలైన వారు కుటుంబాలనే దివాళా తీయిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రానికి కర్ణాటక సరిహద్దుగా ఉండటంతో అడ్డదారుల గుండా గుట్కా, గంజాయి, నల్లబెల్లం, పొగాకు ఉత్పత్తులు ప్రవేశిస్తున్నాయి. గద్వాల, నారాయణపేట, వికారాబాద్ జిల్లాలకు ఇవి చేరుతున్నాయి. రెబన్‌పల్లి, కాన్‌కుర్తి, సజనాపూర్, వాసునగర్, నందిన్నె చెక్‌పోస్టులను దాటుకుని వస్తున్నా అడిగేవారే లేరు.

నిషేధం ఉన్నా... : రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మే నెల నుంచి గుట్కాను నిషేధిత జాబితాలో చేర్చినా ఇప్పటికీ వ్యాపారం గుట్టుగా సాగుతోంది. కర్ణాటకలో గుట్కా, పొగాకు ఉత్పత్తులపై నియంత్రణ లేకపోవడంతో అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రాయచూరు నుంచి వస్తున్న సరకు తెలంగాణ మీదుగా ఏపీకి వెళ్తుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మక్తల్ పట్టణంలోని సంతబజారులో గుట్కా వ్యాపారి పోలీసులు వచ్చినా ఏం కాదనే ధోరణితో వ్యవహరిస్తున్నారని, అలాంటప్పుడు ఫిర్యాదు చేసి ఉపయోగం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పల్లెలకు పాకిన మట్కా : ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు పెద్ద పట్టణాలకే పరిమిత మైన ఈ క్రీడ పల్లెలకూ పాకడంవిస్తుగొలుపుతోంది. ఏజెంట్లుగా మారిన చాలా మంది యువకులు చరవాణులలో ప్రత్యేక యాప్‌ల ద్వారా ఈ నెంబర్ గేమ్‌ను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించారు. పరిస్థితి ఎంతవరకు వచ్చిందంటే రోజూ వందల మంది కొత్తగా ఇందులోకి దిగుతున్నారు.

ఒకప్పుడు ఈ వ్యసన క్రీడను ప్రత్యక్షంగా వెళ్లి ఆడేవారు. అంతా చరవాణిలోనే సాగిస్తున్నారు. మక్తల్ మెయిన్ రోడ్డులో ఓ వ్యక్తి నెలకు రూ.10వేల కిరాయి చెల్లిస్తూ తన దుకాణాన్ని అడ్డాగా మార్చుకొని మట్కాను ప్రోత్సహిస్తున్నారు. నారాయణపేట శివారు కాలనీలో ఒకరు మూడు ఇళ్ల అద్దెకు తీసుకొని పేకాట, మట్కా దందా నడిపిస్తున్నారు.

ఏం చేయాలి? : కర్ణాటక నుంచి జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. కూరగాయల మాటున మత్తు పదార్థాలు రాకుండా అడ్డుకోవాలి. ఏళ్లకు ఏళ్లు పాతుకుపోయిన చెక్‌పోస్టు ఉద్యోగులను తరచూ బదిలీ చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యసన విముక్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కౌన్సెలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి.

విస్తరిస్తున్న జూద కేంద్రాలు : పేకాట జూదానికి వేలాది కుటుంబాలు బలైపోతున్నాయి. రాయచూరు క్లబ్‌లలో 24గంటలు ఈ క్రీడకు అనుమతి ఉన్నందున ఈ ప్రాంతం నుంచి మరీ రాయచూరు వెళ్లి దివాళాతీసే వారు ఎందరో కనిపిస్తారు. జిల్లా నుంచి కిరాయి వాహనాలు నేరుగా పేకాట క్లబ్‌ల వద్దకే నడిపిస్తున్నారు.

- మక్తల్ మండలానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి తన సొంత వాహనంలో మనుషలను తీసుకెళ్లి హైదరాబాద్, షాద్‌నగర్‌లలో ఆడించేవాడు. ఆ తర్వాత రాయచూరుకు మార్చారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి పేకాట, మట్కాలకు బానిసై తనకు ఉన్న ఏడెకరాల భూమిని అమ్ముకున్నారు. ఓ వెలుగువెలిగిన వ్యాపారవేత్త పేకాటకు రాయచూరు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మరణించారు.
- నారాయణపేటలో పేరున్న వ్యాపారి పేకాటతో దివాళా తీసి చివరకు సొంత ఇంటిని తాకట్టు పెట్టారు.
- ఊట్కూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి తన జోడెద్దులు అమ్మి వచ్చిన రూ.1.2 లక్షలను జూదం ఆడి పోగొట్టుకున్నారు. కుటుంబ సభ్యులు మందలించగా ఆత్మహత్యకు పాల్పడ్డారు.

సరస్వతీదేవి అలంకరణలో మైసమ్మ



నవాబ్‌పేట,న్యూస్‌టుడే : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాకర్లపహాడ్ గ్రామ సమీపంలోని పర్వతాపురం మైసమ్మ దేవాలయంలో బుధవారం ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో చండీహోమం చేశారు. అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.


అసలే పేదరికం.. ఆపై క్యాన్సర్ భూతం


తల్లిదండ్రులతో అనిల్

మక్తల్ మండలం సంగంబండ గ్రామానికి చెందిన కళప్ప గొర్రెల కాపరిగా, అతని భార్య పద్మమ్మ రోజుకూలీగా కష్టపడుతూ ఇద్దరు పిల్లలనూ చదివిస్తున్నారు. ఉన్నంతలో సంతోషంగా జీవిస్తున్న ఆ కుటుంబంలోకి క్యాన్సర్ భూతం అడుగుపెట్టింది. ఇంటర్ చదువుతున్న కుమారుడు అనిల్‌ను కబళించింది. ఇన్నిరోజులూ పోగేసిన డబ్బంతా రక్త క్యాన్సర్ చికిత్సకు నీళ్లలా ఖర్చు చేయాల్సి వచ్చింది. గొర్రెలు విక్రయించి హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో కిమోథెరపీ చేయించారు. ఇప్పటికే రూ.10లక్షలు ఖర్చయినా జబ్బు పూర్తిగా నయం కాలేదు. మరో రూ.10లక్షలు ఖర్చుచేస్తే తప్ప బాబు కోలుకోలేడని వైద్యులు చెప్పారు. అంత స్థోమత లేక హైదరాబాద్ నుంచి స్వ గ్రామానికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలిసిన ఓ ప్రయివేటు పాఠశాల యాజమాన్యం తరఫున తిరుపతిరెడ్డి దంపతులు రూ.1.20లక్షల ఆర్థిక సాయం అందించడంతోపాటు కుమార్తె పదోతరగతి వరకు ఉచిత విద్యను అందించడానికి ముందుకు వచ్చారు. దాతలు సహృదయంతో స్పందిస్తే 18ఏళ్ల యువకుడికి నిండు నూరేళ్ల జీవితం ఇచ్చినట్లు అవుతుంది.

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే

గుండె నిండా బడిగంటలు




సర్కారు కొలువు సాధనకు కలిసి చదివారు.. కల నెరవేర్చుకునేందుకు ఒకరినొకరు ప్రోత్సహించుకున్నారు. ఒక్కో ఇంటిలో ఇద్దరు, ఒక్కో ఊరిలో ముగ్గురు, ఆరుగురు విజేతలుగా అవతరించారు. యువతకు ఆదర్శంగా నిలిచారు. వారి నేపథ్యం, చదువు, పరీక్ష కోసం సిద్ధమైన తీరు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం.

- న్యూస్‌టుడే బృందం

బావ, బావమరుదులు ఒకేసారి


మోహన్‌నాయక్


తుల్యానాయక్

ధన్వాడ, న్యూస్‌టుడే : ముడుగుల మల్లయ్యతండాకు చెందిన మోహన్‌నాయక్ ధన్వాడ మండలంలోని మందిపల్లి కొత్త తండాకు చెందిన తుల్యానాయక్ అక్కను వివాహమాడారు. మోహన్ నాయక్, తుల్యానాయక్ ఇద్దరూ డీఎస్సీకి ఎంపికై ఎస్జీటీలుగా నియమితులయ్యారు. ఒకే సారి బావ బామ్మర్దులకు కొలువులు రావడంపై రెండు కుటుంబాలతో పాటు ఆయా తండాల్లో సంతోషం వ్యక్తం అవుతోంది

రెండు నెలల్లో రెండు..


జి.గోవర్ధన్

ధన్వాడ, న్యూస్‌టుడే: నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం మందిపల్లి గ్రామానికి చెందిన జి.గోవర్ధన్‌కు వరుసగా రెండు కొలువులు దక్కాయి. రెండు నెలల క్రితం ఈయనకు బీసీ గురుకులంలో ఉపాధ్యాయుడు ఉద్యోగం వచ్చింది. ఇందులో ప్రవేశం పొందిన ఈయనకు ఇపుడు స్కూల్ అసిస్టెంట్(గణితం) ఉద్యోగం వచ్చింది. జిల్లాస్థాయిలో గణితంలో మూడో ర్యాంకు సాధించిన ఈయన గురుకులం ఉద్యోగం వదిలి స్కూల్ అసిస్టెంట్ ఉత్తర్వులు అందుకున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈయన ఉద్యోగాలు రాక ముందు ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే వ్యవసాయంలో తండ్రికి సహాయపడుతూ వచ్చాడు. గణితమంటే చాలా ఇష్టమని, అదే సబ్జెక్టు ఉపాధ్యాయుడిగా అవకాశం రావడం ఆనందాన్ని కలిగించిందన్నారు.

అన్నదమ్ములు సాధించారు


నియామక పత్రాలతో సోదరులు వెంకటేశ్, శ్రీనివాస్

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులుగా స్థిరపడాలన్న అన్నదమ్ముల లక్ష్యం నెరవేరగా.. అందులో ఒకరు మూడు కొలువులు సాధించి ఔరా అనిపించారు. కోస్గి మండలం పీసీ తండాకు చెందిన ఎస్.నార్యానాయక్, కిష్టమ్మ దంపతుల కుమారులు ఎస్.వెంకటేశ్, ఎస్.శ్రీనివాస్‌నాయక్‌లు 2024 డీఎస్సీలో సత్తాచాటి ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. ఎస్జీటీ జనరల్ కేటగిరీలో తమ్ముడు ఎస్.శ్రీనివాస్ నాయక్ 19వ ర్యాంకు, అన్న ఎస్.వెంకటేశ్‌కు 11వ ర్యాంకు వచ్చింది. ఎస్.శ్రీనివాస్ ప్రస్తుతం విశాఖపట్నంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పీఆర్‌టీ ఉపాధ్యాయులుగా పనిచేస్తుండగా ఇటీవల గ్రూప్-4 పోటీపరీక్షల్లో ప్రతిభచాటి ఉద్యోగం సాధించారు. ఎస్జీటీగా కొనసాగుతామని వారు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వీరు ఒకేసారి ఉపాధ్యాయులుగా నియమితులు కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వెల్లివిరిశాయి.

ఒకే తండాలో ముగ్గురికి..


మీనాక్షి తరుణ్ జగన్నాథ్

కోయిలకొండ, న్యూస్‌టుడే: కోయిలకొండ మండలంలోని కేశ్వాపూర్ పంచాయతీ పరిధి పెద్దతండాకు చెందిన ముగ్గురు ఎస్జీటీ ఉద్యోగాలకు ఎంపికై ఔరా అనిపించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన వీరు తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేందుకు కష్టపడి చదివి సత్తాచాటారు. జిల్లాలో ఎస్టీ విభాగంలో 12 ఎస్జీటీ పోస్టులు ఉండగా ఒకే పెద్దతండాకు చెందిన మీనాక్షి, తరుణ్, జగన్నాథ్‌లు ఎంపిక కావడం విశేషం. మీనాక్షి, జగన్నాథ్‌లు గురుకుల ఉద్యోగాలకు ప్రయత్నించి విఫలమైనా అధైర్యపడకుండా ఎస్జీటీలో సత్తాచాటారు.

రోలర్ స్కేటింగ్‌లో జాతీయ స్థాయికి



బంగారు పతకంతో రితిక్ అభిమన్యురెడ్డి (మధ్యలో)

ధరూరు, న్యూస్‌టుడే : మిర్జాపురం గ్రామానికి చెందిన రితిక్ అభిమన్యురెడ్డి రాష్ట్ర స్థాయి రోలర్‌స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన కారణంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. డిసెంబరులో మైసూరులో 11 ఏళ్లలోపు విభాగం రోలర్‌స్కేటింగ్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి అద్భుతమైన ప్రతిభను కనబరిచి ఎంపిక కావడంపై గ్రామస్థులు అభినందించారు.

మూడు ఉద్యోగాలతో జయకేతనం


తల్లిదండ్రులతో రాజేశ్వరి ఎడమ నుంచి రెండో వ్యక్తి

ఊట్కూరు, న్యూస్‌టుడే : నారాయణపేట మండలం శాసన్‌పల్లి గ్రామానికి చెందిన జయశ్రీ, కృష్ణయ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. గ్రామంలో చిన్న టీకొట్టు నడుపుతూ పిల్లల్ని చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె రాజేశ్వరి కష్టపడి చదివి 2017 డీఎస్సీకి హాజరుకాగా 0.6 మార్కుతో ఉద్యోగం కోల్పోయారు. తల్లిదండ్రుల కష్టం మనసులో ఉంచుకుని ఆత్మవిశ్వాసం కోల్పోకుండా పోటీపరీక్షలకు సిద్ధమయ్యారు. గురుకుల ఉపాధ్యాయుల ఎంపిక పరీక్షల్లో ప్రతిభ చాటి టీజీటీ ఆంగ్లం, సాంఘికశాస్త్రం ఉద్యోగాలు సాధించారు. మూడు నెలల క్రితం మక్తల్ జ్యోతిబా పులే గురుకుల పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా చేరారు. ప్రస్తుతం ఎస్జీటీగా అవకాశం వచ్చినా తరువాత ర్యాంకు వారికి అవకాశం వస్తుందనే భావనతో వదులుకుంటున్నట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో సివిల్స్ ఉద్యోగం సాధించటమే లక్ష్యమని చెబుతున్నారు.

ఔరా! ఐదు కొలువులు


వెంకట్రామి రెడ్డి, గుండుమాల్

కోస్గి, న్యూస్‌టుడే: ఒకటి కాదు... రెండు కాదు... అయిదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అంటే మాటలా? కానీ చేసి చూపించారు గుండుమాల్‌కు చెందిన బాయికాడి వెంకట్రామిరెడ్డి. తండ్రి నారాయణరెడ్డి, తల్లి యశోద వ్యవసాయం చేసుకుంటూ ఆయనను చదివించారు. 2020లో కానిస్టేబుల్ ఉద్యోగం రాగా, చేయడం ఇష్టం లేక వెళ్లలేదు. ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో 2017లో ఎస్జీటీ ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం భక్తిమళ్ల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. ఇటీవల డీఎస్సీలో సాంఘికశాస్త్రంలో జిల్లా స్థాయి మొదటి ర్యాంకు, తెలుగులో ఎనిమిదో ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికయ్యారు.. మరో పరీక్షలో రాష్ట్రస్థాయి 164వ ర్యాంకు సాధించి సాంఘిక సంక్షేమాధికారిగా ఎంపికయ్యారు. . తాను ఉపాధ్యాయుడిగానే కొనసాగి పేద విద్యార్థులకు సహాయపడతానని వెంకట్రామిరెడ్డి చెప్పారు.

యాభైలో పడినా...


అశ్విని నర్సింలు

ధన్వాడ : ధన్వాడ పట్టణానికి చెందిన అశ్విని నర్సింలు స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈయన తెలుగు పండిట్ కోర్సు చదువుకున్నారు. ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తూనే, ఇంటి వద్ద ట్యూషన్లు చెబుతూ, కులవృత్తి చేస్తూ ఇద్దరు పిల్లలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. వయసు 50లో పడినా ఇదే చివరి అవకాశం కావడంతో అహర్నిశలు కష్టపడ్డారు.

మంచు కురిసె.. కంకుల్లా మెరిసె!


వరి కంకులను తలపిస్తున్న మంచు బిందువులు

వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. తెల్లవారుజామున మంచు కురుస్తోంది. మంచు కరిగి వరి పైరు కొనలపై నీటి బిందువులు సూర్య కిరణాలకు మెరుస్తూ కంకులను తలపిస్తున్నాయి. వనపర్తి జిల్లా గోపాల్‌పేట ప్రాంతంలో ఈ చిత్రాలు 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కాయి. - న్యూస్‌టుడే, వనపర్తి వ్యవసాయం


వరి పైరుపై మెరుస్తున్న మంచు బిందువులు

సహకారంతో గెలిచారు..


చెన్నప్ప, సజనాపూర్

దామరగిద్ద : సజనాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి, హన్మంతు దంపతులకు అయిదుగురు సంతానంలో మూడోవారు చెన్నప్ప. ఈ కుటుంబం వ్యవసాయం, గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తోంది. ఆర్థిక పరిస్థితులు అనుకూలించని స్థితిలో వ్యాస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో చెన్నప్ప చదువును కొనసాగించారు. ఇటీవల డీఎస్సీలో జిల్లాలో 13వ ర్యాంకుతో ఉపాధ్యాయ నియామక పత్రాన్ని సీఎం చేతులమీదుగా అందుకున్నారు. పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెన్నప్ప చెప్పారు.

భర్త ప్రోత్సాహంతో మూడు..


మమత

వనపర్తి పట్టణం : కొత్తకోటకి చెందిన మమత మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. భర్త రాఘవరెడ్డి ప్రోత్సాహంతో వీటిని సాధించానని ఆమె తెలిపారు. టీజీటీ గణితం ఉద్యోగానికి ఎంపికై వెల్టూరు బీసీ గురుకుల పాఠశాలలో పని చేస్తున్నారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ గణితంలో జిల్లా స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించారు. బుధవారం హైదరాబాద్‌లో నియాయక పత్రం అందుకున్నారు. హాస్టల్ వార్డెన్‌గా ఎంపికైనప్పటికీ ధ్రువపత్రాల పరిశీలన కాలేదు.

ఊట్కూరు.. ఆరుగురు


కె.అశోక్, మాలతి లత

ఊట్కూరు : ఊట్కూరు నుంచి ఏకంగా ఆరుగురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. సర్దార్‌నగర్ ప్రాంతానికి చెందిన జి.ప్రదీప్ తెలుగు పండింట్‌గా, శ్రీరాంనగర్ ప్రాంతానికి చెందిన కె.అశోక్ స్కూల్ అసిస్టెంట్(ఆంగ్లం)గా నియామకపత్రాలు అందుకున్నారు. మాలతి లత జీవశాస్త్రం స్కూల్ అసిస్టెంట్‌గా, కార్గిల్ చౌరస్తా ప్రాంతానికి చెందిన యువకుడు మహేశ్, శివాజీనగర్ ప్రాంతానికి చెందిన భారతి ఎస్జీటీలుగా నియామక పత్రాలు అందుకున్నారు. టి.మోనప్ప(పాతపేట) హిందీ పండిట్‌గా ఎంపికయ్యారు. వీరంతా ఊట్కూరు పేరును మార్మోగించారు.

పీజీ వైద్య సీట్లకు కసరత్తు

ఎముకలు, ఈఎన్‌టీ, మత్తుమందు, నేత్ర విభాగాల్లో దరఖాస్తు


పీజీ సీట్లపై చర్చిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్ డా.రమేశ్, సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్, సహాయ ఆచార్యులు డా.కిరణ్‌ప్రకాశ్ తదితరులు

పాలమూరు, న్యూస్‌టుడే : పీజీ సీట్ల కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2016లో కళాశాల ప్రారంభమైంది. ఐదేళ్ల తర్వాత నుంచి పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 2021 నుంచి దరఖాస్తు చేసేందుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతి ఇచ్చినా ఆయా వైద్య విభాగాలకు తగినంత ఆచార్యులు, అసోసియేట్ ఆచార్యులు, సహాయ ఆచార్యులు లేకపోవడంతోనే సీట్లు మంజూరు కావటం లేదు. కొత్తగా దరఖాస్తు చేస్తున్న వైద్య విభాగాలపై 'న్యూస్‌టుడే' కథనం.

ప్రస్తుతం ఉన్నవి 29 మాత్రమే : మహబూబ్‌నగర్ వైద్య కళాశాలలో నాన్ క్లినికల్ విభాగాల్లో 23 పీజీ సీట్లు ఉన్నాయి. క్లినికల్‌లో ప్రసూతి విభాగానికి రెండేళ్ల క్రితం అనుమతి రాగా ఆరు పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈ ఏడాది పిడియాట్రిక్(చిన్నపిల్లలు), అప్తమాలజీ(కన్ను), అనస్థీషియా(మత్తుమందు) తదితర విభాగాల్లో పీజీ సీట్లకు దరఖాస్తు చేయగా ఎన్ఎంసీ పిడియాట్రిక్‌కే అనుమతి ఇచ్చింది. ఈ విభాగంలో మంజూరయ్యే నాలుగు పీజీ సీట్లల్లో వచ్చే నెలలో వైద్య విద్యార్థులు ప్రవేశాలు పొందనున్నారు. తగినంత మంది ఆచార్యులు, వైద్య సిబ్బంది లేకపోవడంతో అప్తమాలజీ, అనస్థీషియా విభాగాలకు అనుమతి రాలేదు. నెల క్రితం జరిగిన బదిలీల్లో కళాశాలకు అనస్థీషియా, అప్తమాలజీ ఆచార్యులు రావటంతో ఆయా విభాగాల్లో పీజీ సీట్ల కోసం మళ్లీ దరఖాస్తు చేస్తున్నారు. వీటికి కూడా అనుమతి లభిస్తే అదనంగా నాలుగు చొప్పున 8 పీజీ సీట్లు మంజూరవుతాయి. 2025 విద్యా సంవత్సరానికి గాను ఆర్థోపెడిక్ (ఎముకలు, కీళ్లు), ఈఎన్‌టీ (గొంతు, ముక్కు, చెవి) కోర్సుల్లో నాలుగు చొప్పున సీట్ల కోసం ఈ నెల 17న దరఖాస్తు చేయడానికి కళాశాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఫీజుగా ఒక్కో విభాగానికి రూ.5.90 లక్షల చొప్పున మొత్తం రూ.11.80 లక్షలు ఎన్ఎంసీకి చెల్లిస్తున్నారు. సిబ్బంది కూడా ఉండటంతో వీటికి పీజీ సీట్లు వస్తాయని నమ్ముతున్నారు.

ముఖ్య విభాగాలకే మొండిచేయి.. : మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో సగానికి పైగా రోగులు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ వైద్య సేవల కోసమే వస్తున్నారు. ఇక్కడ జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాల్లో పీజీ సీట్లు చాలా అవసరం. జనరల్ మెడిసిన్ విభాగంలో నాలుగు పీజీ సీట్లు రావడానికి ఒక ఆచార్యుడు, ఏడుగురు అసోసియేట్ ఆచార్యులు, 15 మంది సహాయ ఆచార్యులు, 220 పడకలు, ఏడు యూనిట్లు ఉండాలి. పడకలు, యూనిట్లు ఉన్నా.. ఒక ఆచార్యురాలు, నలుగురు అసోసియేట్ ఆచార్యులు, ఐదుగురు సహాయ ఆచార్యులు మాత్రమే ఉండటంతో పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేయడం లేదు. జనరల్ సర్జరీ విభాగంలో ఆచార్య పోస్టు ఖాళీగా ఉంది. ఒక అసోసియేట్ ఆచార్యుడు, ఆరుగురు సహాయ ఆచార్యులు ఉన్నారు. ఫలితంగా పీజీ సీట్లు వచ్చే అవకాశం లేకుండా పోయింది. జనరల్ సర్జరీ విభాగంలో వైద్యులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ట్రాలీ ఆటో బోల్తా.. నలుగురికి తీవ్రగాయాలు

చికిత్స పొందుతూ కర్నూలు ఆసుపత్రిలో ఇద్దరి మృతి


క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న స్థానికులు

పెబ్బేరు పట్టణం, గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: పెబ్బేరు మండలంలోని రంగాపూర్ గ్రామ శివారు వద్ద జాతీయ రహదారిపై బుధవారం ట్రాలీ ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గద్వాల మండలం చెనుగోనిపల్లి గ్రామానికి చెందిన 15 మంది కుటుంబ సభ్యులు వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం ఉప్పర్‌పల్లి గ్రామానికి వెళ్లి పెళ్లి సంబంధం కుదుర్చుకుని వస్తుండగా జాతీయ రహదారిపై ట్రాలీ ఆటో టైర్ పంక్చర్ అయి అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న 15 మందిలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా వారిని జాతీయ రహదారి అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి, స్వల్ప గాయాలైన వారిని గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో బోయ ముద్దు చిన్నరాముడు(60), బోయ మునెన్న(70) కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. దీంతో చెనుగోనిపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రోదనలు మిన్నంటాయి. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఆదర్శ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం


రాష్ట్ర సేవికా సమితి ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ ఉమాదేవి


మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర సేవికా సమితి కార్యకర్తల పథసంచలనం


మాట్లాడుతున్న ఉమాదేవి

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : శక్తికి ప్రతిరూపం మహిళ అని రాష్ట్ర సేవికా సమితి ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ ఉమాదేవి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణం బండమీదిపల్లిలోని సాందీపని ఆవాసంలో వారంరోజుల పాటు ప్రారంభిక శిక్షా వర్గను నిర్వహించి చివరిరోజు బుధవారం పట్టణంలో పథసంచలనం నిర్వహించారు. మాడల్ బేసిక్ పాఠశాల నుంచి ర్యాలీగా ప్రారంభమై బాలగంగాధర్‌తిలక్ చౌరస్తా, గడియారం, మార్కెట్ రోడ్, పాతబస్టాండ్, పాన్‌చౌరస్తా, రాంమందిర్‌చౌరస్తా, రాంనగర్, వన్‌టౌన్ మీదుగా తిరిగి పాఠశాలకు చేరుకున్నారు. ముఖ్య వక్తగా ఉమాదేవి మాట్లాడుతూ.. సృష్టికి మూలం మహిళ అని అభివర్ణించారు. తమ కుటుంబాన్ని ఏవిధంగా సక్కదిద్దుకుంటుందో ఆదర్శవంతమైన సమాజ నిర్మాణంలో కూడా ప్రతి మహిళ పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. సభాధ్యక్షురాలు డా.కె.పద్మావతి మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కొనేందుకు విద్యార్థినులు ఝాన్సీలక్ష్మీబాయిలా మనోధైర్యంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వయం సేవికా సమితి విభాగ్ కార్యావాహిక దేదీప్యశ్రీ, పాలమూరు జిల్లా కార్యావాహిక నాగిళ్ల అరుణ, రాష్ట్ర స్వయం సేవికలు లక్ష్మీ, వసంతం పద్మావతి, ఉమా, సులోచన, రాజేశ్వరితో పాటు ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణా తీరంలో సఫారీ


సోమశిల అటవీ ప్రాంతంలోని వాచ్‌టవర్ వద్దకు సఫారీ వాహనంలో వచ్చిన పర్యాటకులు

కొల్లాపూర్ అటవీశాఖ ఆధ్వర్యంలో నల్లమల, కృష్ణాతీర ప్రాంతాల్లో విహరించడానికి సఫారీ వాహనం అందుబాటులోకి వచ్చింది. బుధవారం నుంచి ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. వాహనంలో ఒకేసారి 8 మంది ప్రయాణించవచ్చని, ఒకరికి రూ.200 టికెట్‌గా నిర్ధారించినట్లు రేంజర్ చంద్రశేఖర్ తెలిపారు. సోమశిల తీరంలోని పుష్కరఘాట్ల దగ్గర, కొల్లాపూర్‌లోని అటవీశాఖ కార్యాలయం, ఏకో పార్కు వద్ద సఫారీ వాహనం అందుబాటులో ఉంచుతామన్నారు. సోమశిల ఏకో పార్కు, అటవీప్రాంతం లోపల వాచ్ టవర్, ఎర్రకుంట తీరప్రాంతం అందాలు చూపించి తర్వాత యథాస్థానంలో దింపుతారు.

- న్యూస్‌టుడే, కొల్లాపూర్

వివాహిత అనుమానాస్పద మృతి


శాంతమ్మ

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : బావిలో పడి ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందారని వనపర్తి సీఐ నాగభూషణంరావు తెలిపారు. గోపాల్‌పేట మండల ధర్మతండాకు చెందిన శాంతమ్మ (40) మంగళవారం కూరగాయలు తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లారు. ఆమె కుమార్తె వసంత సాయంత్రం 6 గంటలకు తల్లికి ఫోన్ చేసి ఎక్కడున్నావని.. ఎప్పుడు వస్తావని అడిగారు. ఎనుకుంట వద్ద ఉన్నానని త్వరలో ఇంటికి వస్తానని శాంతమ్మ బదులిచ్చారు. ఆమె ఫోన్ 7.30 గంటలకు స్విచ్ఛాఫ్ అయ్యింది. వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామ శివారులో కావలి వెంకటయ్యకు చెందిన బోరు బావి స్టార్టర్‌ను బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. స్టార్టరు కోసం వెతుకుతుండగా బావి గడ్డపై చెప్పులు, చున్నీ, బావిలో చీర ఉన్నట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసి శాంతమ్మ భర్త బద్రు, కుమారుడు గణేశ్, కుమార్తె వచ్చి చీర, చెప్పులను చూసి గుర్తు పట్టారు. ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ నాగభూషణం, ఎస్సై జలేందర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్ బృందం వెంట వచ్చిన శునకం చెన్నూరు శివారులోని రైస్‌మిల్లు వద్దకు వెళ్లి ఆగింది. వివాహిత మృతదేహాన్ని పోలీసులు శవపరీక్ష నిమిత్తం వనపర్తి ఆసుపత్రికి తరలించారు. కుమారుడు గణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. బావిలో నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లికి చెందిన బి.ప్రభాకర్ ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు లభించిందని, త్వరలో నిందితుడిని పట్టుకుంటామని సీఐ తెలిపారు. పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

పట్టుదలతో చదివారు.. లక్ష్యం సాధించారు



జిల్లా కేంద్రం నుంచి బయలుదేరుతున్న బస్సులు, చిత్రంలో డీఈవో రవీందర్, ఆర్డీవో నవీన్, అధికారులు, సిబ్బంది

పాలమూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు కావాలనే లక్ష్యంతో రాత్రి, పగలు అన్న తేడా లేకుండా కష్టపడ్డారు. ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించారు. కలలు సాకారం చేసుకుని నియామక పత్రాలను అందుకున్న అభ్యర్థులను 'న్యూస్‌టుడే' పలకరించింది. వారి మనోగతమిది..

నియామక పత్రాలు అందుకున్న విజేతలు

భార్యాభర్తలకు ఉద్యోగాలు..: గండీడ్ మండలం ఆశిరెడ్డిపల్లికి చెందిన శ్రీనివాసులు, మేఘన దంపతులు ఉపాధ్యాయ కొలువులు సాధించారు. శ్రీనివాసులు గురుకులంలో పీఈటీ, డీఎస్సీలో పీఈటీ పోస్టుకు ఎంపికయ్యారు. భార్య మేఘన హైదరాబాద్ జిల్లాలో డీఎస్సీ ఎస్జీటీ పోస్టుకు ఎంపికయ్యారు.



కర్షకుగా పని చేస్తూనే చదివాను...: జడ్చర్ల కేంద్ర సహకార బ్యాంకులో కర్షకుగా పని చేస్తున్నాను. పుట్టినప్పుడు నాకు కళ్లు లేవు. భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. హైదరాబాద్‌లో ఆల్ ఇండియా రేడియోలో జాకీగా పని చేశాను. అనంతరం 2016లో కేంద్ర సహకార బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. బ్రెయిలీ లిపిలో వింటూ ముఖ్యమైన అంశాలను నోట్ చేసుకున్నాను. అనంతరం డీఎస్సీకి సిద్ధమయ్యాను. భాషా పండితుడిగా తెలుగులో ఉద్యోగం రావడంతో సంతోషంగా ఉన్నా. –టి.వెంకటేష్, మిడ్జిల్



చిన్ననాటి కల సాకారమైంది..: మాకు వ్యవసాయం లేదు. దీంతో తల్లిదండ్రులు ఇద్దరు వ్యవసాయ కూలీ, ఇతర పనులు చేసి కుటుంబం చదివించారు. దూర విద్యలో డిగ్రీ చదివి బీఈడీ చేశాను. రెండు నెలల క్రితం బీసీ గురుకులంలో పీజీటీ ఉద్యోగం వచ్చింది. రాష్ట్రంలోనే రెండో ర్యాంకు సాధించాను. ఇప్పుడు కూడా సాంఘిక శాస్త్రంలో ప్రథమ ర్యాంకు సాధించాను. గురుకుల ఉద్యోగానికి రాజీనామా చేశాను. చిన్ననాటి కల సాకారమైనందుకు ఆనందంగా ఉంది. –రఘునాథ్‌రెడ్డి, నెల్లికొండి, సీసీకుంట



కష్టాలకు ఎదురీది..: మా నాన్న బాదేపల్లి మార్కెట్ యార్డులో హమాలీ పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదివాను. మా నాన్నకు 2012లో పక్షవాతం వచ్చింది. తల్లి 2018లో తనువు చాలించారు. దీంతో నాన్నను చూసుకుంటూ నేను, చెల్లి ఉంటున్నాం. స్కూల్ అసిస్టెంట్ భౌతిక శాస్త్రంలో ఉద్యోగం రావడంతో కష్టానికి ఫలితం దక్కింది. – గౌతమి, బాదేపల్లి



రెండో కొలువు..: తల్లిదండ్రులు ఇద్దరూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో 15 ఏళ్ల నుంచి వంట పని చేశారు. ఇప్పుడు ఆరోగ్య కారణాలతో ఇంటి వద్దే ఉంటున్నారు. నాన్న శక్తి కూడా పూర్తిగా క్షీణించి పని చేయడానికి శరీరం సహకరించడం లేదు. 2 నెలల క్రితం నాకు బీసీ గురుకులం పీజీటీగా ఉద్యోగం వచ్చింది. దానికి రాజీనామా చేసి ఇప్పుడు స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరుతున్నాను. – పరశురాములు, ఫరీద్‌పూర్, సీసీకుంట



జాతీయ సేవా పథకంతో క్రమశిక్షణ



ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ సంచాలకులు రామకృష్ణను సత్కరిస్తున్న పీయూ రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు

పాలమూరు, న్యూస్‌టుడే: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ, సేవాభావం ఏర్పడుతుందని పీయూ రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పీయూలో ఏర్పాటు చేసిన ముందుగా రిపబ్లిక్ పరేడ్‌కు అభ్యర్థులను ఎంపిక చేసే కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ సంచాలకులు రామకృష్ణ మాట్లాడుతూ.. ఆర్‌డీ పరేడ్‌లో అభ్యర్థులకు ఎత్తు, పరుగులో వేగం, పరేడ్ మౌఖిక పరీక్షలో అర్హత సాధించిన వారికి అవకాశం కల్పిస్తామన్నారు. ఎంపికైన వారు వచ్చే నెల 12 నుంచి 21వ తేదీ వరకు మహారాష్ట్రలోని జల్గాంలో జరిగే ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారులు నరసింహ గౌడ్, సంజయ్‌కుమార్, పీయూ సమన్వయకర్త ప్రవీణ, అధ్యాపకులు అర్జున్‌కుమార్, రవికుమార్, జ్ఞానేశ్వర్, సుభాషిణి, నాగరాజు, పీడీ శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి ఆర్థికసాయం

గోదావరిఖని పట్టణం: నీట్‌లో 426వ ర్యాంకు సాధించి వైద్య కళాశాలలో ప్రవేశ రుసుం చెల్లించలేని మహబూబ్‌నగర్ పట్టణం సింహగిరి ప్రాంతానికి చెందిన భాగ్యలక్ష్మికి.. గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాల వైద్య విద్యార్థులు రూ.10వేలు ఆర్థికసాయం బుధవారం పంపించారు. చదువులో ఉన్నతంగా రాణిస్తున్నా ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదనే సహాయం అందించినట్లు మెడికోల ప్రతినిధి ప్రశాంత్ తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో భాజపా సత్తాచాటాలి: ఎంపీ



కందూరులో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

అడ్డాకుల, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో తెలంగాణలో భాజపా అధికారం చేపట్టబోతోందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. అడ్డాకుల మండలంలోని కందూరులో బుధవారం చేపట్టిన భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపా సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలోనే దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. హరియాణాలో హ్యాట్రిక్ ఫలితాలే అందుకు నిదర్శనమని అన్నారు. అనంతరం ఆమె శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు కొండాప్రశాంత్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, లక్ష్మీ, బుచ్చన్నయాదవ్, గట్టుమల్లేష్ పాల్గొన్నారు.

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రభుత్వం హైడ్రా పేరుతో ఇళ్లను కూల్చడంతో పేదలు రోడ్డున పడుతున్నారని, ఎంపీ డీకే అరుణ విమర్శించారు. బుధవారం చిన్నచింతకుంట మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీలో ఉపాధ్యాయులకు చోటు

నవాబ్‌పేట,న్యూస్‌టుడే : రాష్ట్ర పీఆర్టీయూ టీఎస్ కమిటీలో మండల ఉపాధ్యాయులకు స్థానం కల్పించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా కృష్ణయ్య, డాక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా శశికిరణ్, కార్యదర్శులుగా జయరాజ్, ఓంప్రకాశ్‌లను ఎంపిక చేశారు. ఎంపికైన ఉపాధ్యాయులకు మండల శాఖ అధ్యక్షుడు యాదయ్య, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్‌గౌడ్, మండల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నిరసన

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్) న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకుండా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయటాన్ని ఖండిస్తూ బుధవారం మహబూబ్‌నగర్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ముందుగా ఆర్అండ్‌బి అతిథిగృహం నుంచి ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ కూడలికి చేరుకున్నారు. నిరసన కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ నాయకులు పి.బాలయ్య, జె.బాలరాజు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్పీ రాష్ట్ర, జిల్లా నాయకులు టి.జంగయ్య, శ్రీరాములు, టి.రాజు, కమలాకర్, కాన్షీరాం, రాంచందర్, రాములు, వినోద్, సురేశ్ పాల్గొన్నారు.

తపాలా ఖాతాలకు ఉపకార వేతనాలు

పాలమూరు : ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసే విద్యార్థులు తపాలాశాఖలో ఖాతా ఉంటే కూడా అనుమతిస్తామని ఎస్సీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు సుదర్శన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024- 25 విద్యా సంవత్సరానికి ఉపకార వేతనాల కోసం ప్రకటన వచ్చిందని, ప్రీమెట్రిక్, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర కోర్సులలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

దేవరకద్రను పురపాలికగా మార్చాలని వినతి



సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

పాలమూరు, దేవరకద్ర గ్రామీణం న్యూస్‌టుడే: దేవరకద్ర ప్రస్తుతం మేజర్ గ్రామ పంచాయతీగా ఉందని, దానిని పురపాలక సంఘంగా మార్చాలని డీసీసీ అధ్యక్షుడు, ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సమీకృత పాఠశాలను మంజూరు చేయాలన్నారు. దానికి సంబంధించిన భూసేకరణను పూర్తి చేశామని, వివరాలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించి వారి ద్వారా ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో కోర్టు కూడా మంజూరు చేయాలని విన్నవించారు. దీనిపై సీఎం, డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని ఆయన 'న్యూస్‌టుడే'కు వివరించారు.

పంచాయతీల్లో వసతులు కల్పించండి

భూత్పూర్, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సూచించారు. భూత్పూర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సర్పంచులు, ప్రజాప్రతినిధులు లేని కారణంగా కార్యదర్శులే బాధ్యత తీసుకొని పండుగలకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రత్యేక అధికారి వేణుగోపాల్, ఎంపీడీవో ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ



గ్రంథాలయ ఛైర్మన్ నర్సింహారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యేలు యెన్నం, అనిరుధ్‌రెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ డా.రియాజ్

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, పాలమూరు న్యూస్‌టుడే : జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధే ధ్యేయంగా ప్రత్యేక చొరవ తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ గ్రంథాలయ ఛైర్మన్‌గా మల్లునర్సింహారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. మెట్టుగడ్డలోని కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ.. గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు సౌకర్యాలను మెరుగుపర్చాలని నూతన ఛైర్మన్‌కు సూచించారు. మేజర్ గ్రామపంచాయతీల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మల్లు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ డా.రియాజ్, మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మార్కెట్‌కమిటీ ఛైర్మన్ బెక్కరి అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాంకు నివాళి

నవాబ్‌పేట : ధర్మసమాజ్ పార్టీ, డీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కాన్షీరాం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ధర్మసమాజ్ పార్టీ నాయకులు ప్రసాద్, రమేశ్, అంబేద్కర్, శ్రీనివాస్, పొన్నం కుమార్, ఆంజనేయులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు చీరల పంపిణీ

పాలమూరు : దసరా పండగను పురస్కరించుకుని ఆశా కార్యకర్తలకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, నాయకులు కృష్ణయ్య, మోతీలాల్, లతశ్రీ, రాబియా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో బినామీల వాహనాలు తొలగించండి



రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న అద్దె వాహనాల సంఘం ప్రతినిధులు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు బినామీ పేర్ల మీద తమ సొంత వాహనాలను అద్దెలకు నడుపుతున్నారని, బినామీ అద్దె వాహనాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాదర్, ప్రతినిధులు బుధవారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో బినామీ పేర్ల మీద అద్దె వాహనాలు నడుపుకోరాదని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసినప్పటికీ అధికారులు బినామీ పేర్లతో తమ వాహనాలను నడిపిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. స్పందించిన మంత్రి బినామీ వాహనాలను తొలగించి నిజమైన అద్దె వాహనాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఖాదర్ తెలిపారు. సంఘం ప్రతినిధులు కేశవులు, దస్తగిరి, సంజీవ్ తదితరులు ఉన్నారు.



మహబూబ్‌నగర్: సద్దలగుండు శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో.. రవీంద్రనగర్‌లో.. శ్రీనివాసకాలనీలోని.. దేవరకద్రలో.. అమిస్తాపూర్‌లో.. గండీడ్: పంచాంగల్‌తండాలో.. జడ్చర్లలో..

వాడవాడలా బతుకమ్మా.. కరుణించు మాయమ్మ



మహబూబ్‌నగర్: బ్రాహ్మణవాడలో కుంకుమార్చనలో మహిళలు



మహబూబ్‌నగర్ : కళాశాల మైదానంలో కోలలతో చిన్నారులు

జిల్లావ్యాప్తంగా బతుకమ్మ, శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఏడోరోజు బుధవారం అమ్మవారు చదువులతల్లిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రీతికరమైన తెల్లని పుష్పాలు, చేతిలో వీణా.. హంసవాహనంపై ఆసీనులైనట్టుగా సుందరంగా అలంకరించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు టీడీగుట్ట, పరిమళగిరి, రవీంద్రనగర్, ప్రేమ్‌నగర్, టీచర్స్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ తదితర ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాతలను దర్శించుకున్నారు. పట్టణంలోని జయశంకర్ కాలనీ, బాలాజీ నగర్, టీచర్స్‌కాలనీ, భగీరథకాలనీ, సింహగిరి కాలనీ, మెట్టుగడ్డలోని ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. క్రిస్టియన్‌కాలనీలోని దుర్గామాతను మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పూజించారు. కలెక్టరేట్ ఆవరణలో వివిధ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. ఆర్టీసీ ప్రాంగణంలో మహిళా ఉద్యోగులతో కలిసి ఆర్ఎం శ్రీదేవి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. భూత్పూర్ పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. జడ్చర్ల, మహమ్మదాబాద్, దేవరకద్ర, బాలానగర్, మిడ్జిల్, గండీడ్, రాజాపూర్ తదితర మండలాల్లో బతుకమ్మ వేడుకల నిర్వహణతో పాటు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయా మండలాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. – న్యూస్‌టుడే, బృందం



మహబూబ్‌నగర్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో..



మూసాపేటలో ఎమ్మెల్యే సతీమణి కవిత.. బస్సులో బతుకమ్మలతో ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి, ఉద్యోగులు.. కలెక్టరేట్ ఆవరణలో అధికారులు.. జయశంకర్‌కాలనీలో మహిళలు

ఇజ్రాయెల్ దాడులను ఖండించాలి: సీపీఎం

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను ప్రజాస్వామ్య వాదులు తీవ్రంగా ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నల్లవెల్లి కురుమూర్తి, డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ భానుప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మోటారు లైన్‌లో నిరసన తెలియజేశారు. ఇజ్రాయెల్ దాడులతో పాలస్తీనాలో వేలాది మంది మృత్యువాత పడుతున్నారని ఆరోపించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి చంద్రకాంత్, సభ్యులు రాజ్‌కుమార్, మోటార్ లైన్ కార్యదర్శి సయ్యద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

జడ్చర్ల, న్యూస్‌టుడే : మాజీమంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేత స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను జడ్చర్ల మండలం మాచారం గ్రామంలో బుధవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరుగుతున్న టోర్నమెంటును మాజీ సర్పంచి రవింధర్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో భారాస నాయకులు ప్రణీల్, శంకర్‌నాయక్, చారీ, తిరుపతయ్య పాల్గొన్నారు.

హజ్ యాత్రకు 170 మంది ఎంపిక

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ముస్లింల పవిత్ర ప్రార్థనా స్థలమైన హజ్‌కు జిల్లా నుంచి 170 మంది యాత్రికులు ఎంపిక అయ్యారు. హజ్ యాత్రకు సంబంధించి బుధవారం మహబూబ్‌నగర్ వక్ఫ్ కాంప్లెక్స్‌లోని హజ్ సొసైటీ భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో యాత్రకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. ఎంపికైన వారికి హజ్ కమిటీ అధ్యక్షుడు మహమూద్ అలీ ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి మెరాజుద్దీన్, సభ్యులు సత్తార్, రజాక్ నిజామీ, ఖాజా నిజాముద్దీన్, రఫిఖ్ ఉర్ రహమాన్, మహ్మద్ అర్షద్‌అలీ పాల్గొన్నారు.

వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై మండల కేంద్రం నుంచి వెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి గుంతలో పడ్డారు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు గుర్తించి మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రాగి తీగ చోరీ

గండీడ్, న్యూస్‌టుడే : విద్యుత్తు నియంత్రికలో రాగి తీగను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన ఘటన గండీడ్ మండలంలోని జక్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు వివరాల ప్రకారం.. కాంతమ్మ పొలంలో ఉన్న నియంత్రిక సరఫరాను నిలిపివేసి రాగి తీగతో పాటు ఆయిల్‌ను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించగా ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. పలువురిపై కేసు

గండీడ్, న్యూస్‌టుడే : పొలంబాట విషయంలో ఇరువర్గాల ఘర్షణతో పలువురిపై కేసు నమోదైన ఘటన గండీడ్ మండలంలోని కొండాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. కొండాపూర్ గ్రామానికి చెందిన హన్మయ్య, రాములు పొలం బాట విషయంలో ఘర్షణ జరిగి కర్రలు, రాళ్లతో దాడి చేసుకోవడంతో గాయాలయ్యాయి. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవాబ్‌పేట: చాకల్‌పల్లి గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌బాబు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. చాకల్‌పల్లి గ్రామానికి చెందిన శేఖర్ సొంత ట్రాక్టర్‌తో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా దయాపంతులపల్లి సమీపంలో పట్టుకున్నట్లు చెప్పారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ



విగ్రహం వద్ద ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

గండీడ్, న్యూస్‌టుడే : బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికై కృషి చేసిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం గండీడ్ మండలంలోని వెన్నాచేడ్ గ్రామంలో గీతా కార్మిక సహకార సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ చేశారు. వారు మాట్లాడుతూ.. గౌడ కులస్థులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని సూచించారు. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి హాజరై విగ్రహానికి పూలమాలలు వేశారు. భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నఈశ్వరప్ప, గౌడ ఐక్య వేదిక అధ్యక్షుడు నారాయణగౌడ్, దత్తుగౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్‌ఛైర్మన్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, నాయకులు జితేందర్‌రెడ్డి, కెఎం. నారాయణ, గౌడ తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ కేంద్రం అందుబాటులో ఏర్పాటు చేయండి

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: వైద్యారోగ్యశాఖ పాత భవనంలో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ కేంద్రాన్ని పాత డీఈఓ కార్యాలయంలోకి మార్చాలని తెలంగాణ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి జరీనాబేగంను కలిసి వినతిపత్రం అందజేశారు. వెల్‌నెస్ కేంద్రం ఇన్నాళ్లు పాత కలెక్టరేట్ ఆవరణలో అందుబాటులో ఉండేదని, కలెక్టరేట్ భవనం తొలగించడంతో బండ్లగేరి సమీపంలోని వైద్య ఆరోగ్యశాఖ పాత భవనంలోకి మార్చారని తెలిపారు. దీంతో చికిత్స కోసం వెళ్లాలనుకునే వయోవృద్ధులు దూరభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సాయిలుగౌడ్, జిల్లా కార్యదర్శి కె.బాలకిషన్ వినతిపత్రంలో పేర్కొన్నారు. పెన్షనర్ల సంఘం ప్రతినిధులు విశ్వనాథం, నారాయణరెడ్డి, కృష్ణయ్య, వెంకటేశ్వర్‌రావ్, లక్ష్మయ్య, అంజయ్య, ప్రభాకరాచారి తదితరులు ఉన్నారు.